
సాక్షి కర్నూలు

గురువారం । 25 । జనవరి । 2024



సాక్షి గణపతికి విశేష పూజలు
శ్రీశైలంటెంపుల్: శ్రీశైల క్షేత్రంలో బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి, జ్వాలా వీరభద్రస్వామికి అభిషేకాలు, విశేష పుష్పార్చన తదితర పూజలు నిర్వహించారు.



నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్
సీసీ కెమెరాల నిఘా మధ్య ఈ ఏడాది ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈమేరకు ఇంటర్మీడియట్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. 10లో



కూలీల బిడ్డలకు 'ఉన్నతి'
ఉపాధి హామీ పనులు చేసే కూలీల ఇళ్లలోని విద్యావంతులకు ఉన్నతి పథకం కింద నైపుణ్యాలను మెరుగుపరిచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిస్తున్నాయి. 10లో

న్యూస్‌రీల్

జేఈఈ మొదటి విడత పరీక్షలు ప్రారంభం

● జిల్లాలో రెండు కేంద్రాల్లో నిర్వహణ

కర్నూలు సిటీ: దేశ వ్యాప్తంగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)ఆధ్వర్యంలో జేఈఈ మెయిన్స్ తొలి విడత పరీక్షలు ప్రారంభం అయ్యాయి. పేపర్-1, పేపర్-2లుగా నిర్వహించే పరీక్షల్లో బుధవారం పేపర్-2(బీఆర్క్) పరీక్షను జిల్లాలో రెండు కేంద్రాల్లో నిర్వహించారు. ఉదయం 8.30 గంటలకు, మధ్యాహ్నం 2.30 గంటలకు రెండు సెషన్లలో నిర్వహించిన పరీక్షకు 358 మందికిగాను 325 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష జరుగుతున్న సమయంలో సర్వర్ డౌన్ కావడంతో కొంత ఆలస్యంగా జరిగినట్లు సమాచారం. ఈ నెల 27, 29, 20, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో పేపర్-1(బీటెక్)పరీక్షలు జరగనున్నాయి.

కలెక్టరేట్ పనులు పది రోజుల్లో పూర్తి చేయాలి

● జిల్లా కలెక్టర్ సృజన



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ సృజన

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్ ఆధునికీకరణ పనులు పదిరోజుల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. బుధవారం ఉదయం ఆమె కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియం, డీఆర్వో కార్యాలయ పనులను పరిశీలించారు. పనులు అసంపూర్తిగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. గడువు దాటుతున్నా పనులు పూర్తి కాకపోవడానికి గల కారణాలను అన్వేషించారు. పదిరోజుల్లో పనులను పూర్తి చేయాలని, ప్రతి రోజు జరిగిన పనులకు సంబంధించిన నివేదికను తనకు సమర్పించాలని ఆర్‌అండ్‌బీ ఈఈ సురేష్‌ను ఆదేశించారు. ఆమె వెంట డీఆర్వో కె.మధుసూదన్‌రావు, ఏఓ శ్రీనాథ్ పాల్గొన్నారు.

టీబీ డ్యాంలో 9 టీఎంసీల నీరు

హొళగుంద: కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ వద్ద నిర్మించిన తుంగభద్ర జలాశయం నుంచి బళ్లారి పట్టణానికి తాగునీటి అవసరాలతో పాటు ఇతర కాలువలకు నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో డ్యాంలో నీటి నిల్వ తగ్గుముఖం పట్టింది. బుధవారం సాయంత్రం సమయానికి డ్యాంలో 9.8 టీఎంసీల నిరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో జీరో ఉండగా అవుట్‌ఫ్లో 451 క్యూసెక్కులుగా నమోదైంది. గత నెల 25న తుంగభద్ర దిగువ కాలువ (ఎల్లెల్సీ)కు నీరు బంద్ చేయగా ఇటీవలే బళ్లారి పట్టణానికి తాగునీటి కోసం టీబీ బోర్డు అధికారులు వంద క్యూసెక్కులుకు పైగా వదులుతున్నారు.

30న ఆళ్లగడ్డలో జాబ్ మేళా

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 30న ఆళ్లగడ్డ ప్రభుత్వ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ప్రతాపరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్సలెంట్ ఫార్మాసైన్స్ ప్రైవేట్ లిమిటెడ్, విట్రోటెక్ సాఫ్ట్ సొల్యూషన్, కియా తదితర కంపెనీల ప్రతినిధులు హాజరై ప్రతిభ ఉన్నవారిని ఎంపిక చేసుకుంటారన్నారు. పదవ తరగతి, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, బీటెక్, డిప్లమా, బీఫార్మసీ, పీజీ పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు వారు అర్హులన్నారు. ఆసక్తి ఉన్న వారు విద్యార్హత పత్రాలు, ఆధార్, రెండు ఫొటోలతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. మరింత సమాచారం కోసం 9440224291 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆలమూరు చేరిన పార్వేట పల్లకీ

రుద్రవరం: అహోబిల పార్వేట ఉత్సవమూర్తుల పల్లకీ బుధవారం మండల పరిధిలోని ఆలమూరు గ్రామ శివారులోని తెలుపు మీదకు చేరుకుంది. ఈ సందర్భంగా సర్పంచు పాణ్యం లక్ష్మీదేవి, గ్రామ పెద్దలు మేళతాళాలతో స్వాగతం పలికారు. అక్కడి నుంచి పల్లకీని పలు కాలనీల తెలపుల మీదకు చేర్చారు. ఆయా కాలనీల వాసులు కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి పల్లకీలో కొలువైన ఉత్సవ మూర్తులు జ్వాలానరసింహస్వామి, ప్రహ్లాదవరదస్వామి వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవ మూర్తుల పల్లకీ చేరుకోవడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.



పల్లకీని గ్రామంలోకి తీసుకొస్తున్న దృశ్యం



అప్పటికీ ఇప్పటికి చానా తేడా..



నా వయస్సు 75 ఏళ్లు. పదేళ్ల నుంచి పింఛను వస్తుంది. టీడీపీ హయాంలో రూ.200 నుంచి రూ.1000 వరకు పింఛను వచ్చింది. అయితే ఒకటో తేదీ నుంచి 15 తేదీ వరకు తిరిగి తిరిగి సచ్చినాము. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వచ్చినాక చానా మార్పు వచ్చింది. పింఛను డబ్బు కూడా ఇప్పుడు రూ.3వేలు ఇస్తున్నారు. యాటికి తిరిగే పని లేకుండా ఇంటి కాడికే వచ్చి ఇచ్చిపోతున్నారు. ముసలోళ్లకు ఇబ్బంది లేకుండా సేసినారు. ఒకటో తేదీన జీతం వచ్చినట్లుగా వస్తుంది.
– లక్ష్మమ్మ, కృష్ణగిరి

☛ టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018 డిసెంబర్ నెలలో ఉమ్మడి జిల్లాలో 3,61,563 పింఛన్లు ఉండగా, రూ.40.27 కోట్లు మాత్రమే నగదు పంపిణీ చేశారు.

☛ వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వంలో 2024 జనవరి నెలలో పింఛన్ల సంఖ్య 4,73,913. గతంతో పోలిస్తే 2023 సెప్టెంబర్ నాటికే 1,12,350 పింఛన్లు పెరగడం విశేషం. వీటికి పంపిణీ చేస్తున్న నగదు అక్షరాలా రూ.141.41 కోట్లు.

ఇంతకంటే ఇంకేం కావాల..



టీడీపీ ప్రభుత్వంలో వృద్ధాప్య పింఛను కోసం సానా కష్టపడిన. ఆఫీసుల చుట్టూ తిరిగినా, అధికారుల కాళ్లావేళ్లా పడినా ఎవరూ పట్టించుకోల్యా. నాయకులకు సెప్పుకున్నా దిక్కులేకపాయ. లాస్టుకి జన్మభూమి కార్యక్రమంలో పింఛను మంజూరైనట్లు ప్రకటించినారు. మళ్లీ ఏమైనాదో ఏమో, నేను వాళ్ల పార్టీ వాన్ని కాదని తీసేసినారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైనాక నేను అడగకుండానే 2019లో పింఛను ఇచ్చినారు. అప్పుడు రూ.2,250 వస్తుంటే, ఇప్పుడు రూ.3వేలు ఇస్తున్నారు. చానా సంతోషంగా ఉంది. పింఛను తీసుకోనీక యాడికీ పోకుండా ఇంటికాడికే వచ్చి పొద్దునే డబ్బులు ఇస్తుంటే మాలాంటోళ్లకి ఇంకేం కావాల.
– ఎం.ఆంజనేయ, ఉప్పర్లపల్లి, తుగ్గలి మండలం

జీతంలా పింఛను!

టీడీపీ హయాంలో రాజకీయ కక్ష
- పింఛను మంజూరుకు చావుతో ముడి
- 15 తేదీ వరకు కార్యాలయాల చుట్టూ తప్పని ప్రదక్షిణ
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రామాణికం
- ఉదయాన్నే ఇంటి వద్దకు పంపుతున్న ప్రభుత్వం
- ఏడాదికి రెండు దఫాల కొత్త పింఛన్లు



కర్నూలు(అగ్రికల్చర్): పింఛను పొందాలంటే గత టీడీపీ ప్రభుత్వంలో చచ్చేంత చావు. ఊర్లో ఎవరైనా చస్తారా అని ఎదురుచూడాల్సిన పరిస్థితి. అప్పుడు కానీ కొంత పింఛన్లు ఇచ్చేవారు కాదు. 2014–15 నుంచి 2018–19 మధ్య ఇదీ పింఛన్ల ప్రక్రియ. అంతేకాదు.. ఆయన మనోడు కాదు, ఈమె మనకు ఓటు వేయదు.. ఇలాంటి సాకులతో దరఖాస్తులను తిరస్కరించడం పరిపాటి. పొరపాటున అధికారులు దయతలచినా జన్మభూమి కమిటీలు నిర్మోహమాటంగా పక్కనపెట్టేసిన దరఖాస్తులు కోకొల్లలు. వంద శాతం 'పచ్చ'పాతం చూపడంతో అర్హులు విసిగిపోయారు. ఒకరోజు రచ్చబండ వద్ద, మరొక రోజు పంచాయతీ ఆఫీసు వద్ద అంటూ ఇచ్చే అరకొర పింఛను డబ్బు కోసం ప్రతినెలా 15వ తేదీ వరకు తిప్పుకుంటూ లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెట్టారు. అప్పటి అవస్థలు ఎన్ని చెప్పినా తక్కువే. గుర్తు చేసుకుంటే లబ్ధిదారులు కూడా కన్నీరు పెట్టక మానరు.

అర్హత ఉంటే చాలు..

వైఎస్‌ఆర్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక పింఛనుదారుల కష్టాలు తొలగిపోయాయి. పింఛను మంజూరులో రాజకీయ ప్రమేయం ఊసే లేకుండా పోయింది. అర్హత ఉంటే చాలు.. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా పింఛను మంజూరవుతోంది. ప్రతి 50 ఇళ్లకు గ్రామ, వార్డు వలంటీర్లను నియమించి, వీరి ద్వారానే నేరుగా ఇంటికే పింఛను సొమ్ము పంపించే ఏర్పాటు చేశారు. 1వ తేదీ వచ్చిందంటే పండగైనా, వానొచ్చినా, సెలవు రోజైనా.. పింఛను ప్రక్రియ కొనసాగుతోంది. ఏడాదికి రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ రాకతో పింఛను పొందడం సులభతరమైంది. ఎక్కడికీ వెళ్లాల్సిన పనిలేకుండా, ఎవరి చుట్టూ తిరిగే అవసరం లేకుండాపోయింది. అర్హులైతే చాలు, వలంటీర్లు దరఖాస్తులను తీసుకెళ్లి పింఛను మంజూరు చేయిస్తున్నారు. ఆ తర్వాత ప్రతినెలా ఉదయం 5 గంటల నుంచి ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు తెలుసుకొని మరీ పింఛను డబ్బు చేతిలో పెడుతున్నారు. లబ్ధిదారులు ఇంటి వద్ద లేకపోతే ఎక్కడున్నారో తెలుసుకొని మరీ అక్కడికి వెళ్లి డబ్బు ముట్టజెబుతున్నారు. ఈ మార్పును చూసి గత ప్రభుత్వంలో ఎదుర్కొన్న కష్టాలను లబ్ధిదారులు పీడకలగా భావిస్తున్నారు.

అర్హత వయస్సు 60కి తగ్గింపు

టీడీపీ హయాంలో వృద్ధులు పింఛను పొందాలంటే 65 ఏళ్లు నిండాలి. వేలాది మంది పింఛను కోసం ఎదురుచూస్తూ చివరకు పింఛను పొందకుండానే మరణించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పింఛను అర్హత వయస్సు 60కి తగ్గించారు. అర్హత వయస్సు తగ్గించడం వల్ల వేలాది మంది వృద్ధులకు 60 ఏళ్లు నిండిన వెంటనే పింఛను లభిస్తోంది. దళారీలను ఆశ్రయించకుండా, రాజకీయ సిఫార్సులు లేకుండా అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తుండటం విశేషం.

టీడీపీ ప్రభుత్వంలో పింఛను పంపిణీ ఇలా..

ఒకటో తేదీ వచ్చిందంటే పంచాయతీ కార్యాలయాలు, పాఠశాల ప్రాంగణాలు, రచ్చబండల వద్ద వృద్ధులు, వికలాంగులు, వితంతువుల గుంపు కనిపించేది. ఒక్క రోజు కాదు, రెండు రోజులు కాదు.. వారం పది రోజుల వరకు సచ్చీ బతికి అక్కడికి చేరుకోవడం, చివరకు ఈ రోజు కాదంట అనుకుంటూ ఇళ్లకు చేరుకోవడంతో రోజు గడిచిపోయేది. ఇక పింఛను ఇచ్చే రోజు కూడా రోజంతా అక్కడ కూర్చుంటే కానీ తమ వంతు వచ్చేది కాదు. ఇచ్చే అరకొర డబ్బులోనే ఏదో ఒక సాకుతో కొంత నొక్కేయడం పరిపాటి.

ఉమ్మడి జిల్లాలో పింఛన్ల వివరాలు..

కర్నూలు	జిల్లా	నంద్యాల
2,48,905	పింఛన్లు	2,25,007
74,53,32,000	పంపిణీ చేస్తున్న మొత్తం(రూ॥ల్లో)	66,88,34,500

పింఛన్లు మొత్తం **4,73,913** / పంపిణీ చేస్తున్న మొత్తం(రూ॥ల్లో) **141,41,66,500**

కిలోమీటర్ల నడక.. రోజుల తరబడి నిరీక్షణ

టీడీపీ ప్రభుత్వ హయాంలో వృద్ధులు, వికలాంగులు, వితంతువులు పింఛను తీసుకునేందుకు ఎదుర్కొన్న పాట్లకు ఈ దృశ్యమే సాక్ష్యం. పింఛను పంపిణీ చేస్తున్నారని దండోరా వేయిస్తే ఎక్కడో ఉన్న పంచాయతీ కార్యాలయాల దగ్గరకు ముక్కుతూ మూల్గుతూ చేరుకోవాల్సిన పరిస్థితి. అప్పటికైనా పింఛను చేతికందుతుందనుకుంటే అదీ నమ్మకం లేదు. అధికారి వస్తాడో రాడో తెలియదు, వచ్చినా యంత్రం పని చేస్తుందో లేదోనన్న ఆందోళన.. అన్నీ ఉన్నా సెల్‌ఫోన్ సిగ్నల్ లేక రోజుల తరబడి తిగక తప్పని దుస్థితి. ఉదయం ఇంటి నుంచి వెళ్తే తమ వంతు వచ్చేసరికి ఏ సాయంత్రమో అయ్యేది. అప్పటి వరకు కూడు, నీళ్లు లేకుండా నీరసించి సొమ్మసిల్లిన ఘటనలు కోకొల్లలు. ఇదిగో ఇది ఎమ్మిగనూరు ఎంపీడీఓ కార్యాలయం వద్ద జాతరను తలపిస్తున్న పింఛన్ల పంపిణీని చూస్తే అప్పటి ప్రభుత్వం ఈ నిస్సహాయులను ఏ స్థాయిలో ఇబ్బందులకు గురి చేసిందో అర్థమవుతోంది. గుడికల్లు గ్రామం నుంచి ఎమ్మిగనూరులోని ఎంపీడీఓ కార్యాలయానికి నాలుగు కిలోమీటర్ల దూరం. అరకొర పింఛను కోసం ఇంత దూరం ప్రయాణించేందుకు లబ్ధిదారులు ఎదుర్కొన్న అవస్థలు వర్ణనాతీతం.
– ఎమ్మిగనూరు రూరల్

ఇది కదా.. అభివృద్ధి



ఈ దృశ్యం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనిది. కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేదు.. అధికారుల కోసం నిరీక్షణ అవసరం లేదు.. ఒకటో తేదీన జీతం ఇచ్చినట్లుగా పింఛను అందుతోంది. ఈమె పేరు బోయ యంకమ్మ, గుడేకల్‌లోని శ్రీరామనగర్‌లో నివాసం ఉంటోంది. వలంటీర్ రామస్వామి ప్రతి నెలా ఆమె ఇంటి వద్దకే వెళ్లి పింఛను అందిస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తోంది. ఈ ప్రభుత్వం సల్లగుండాలని ఆశీర్వదిస్తోంది.

చదువుతో అమ్మాయిల్లో ఆత్మస్థైర్యం



వ్యాస రచన పోటీలో గెలుపొందిన విద్యార్థినికి మెమెంటో అందజేస్తున్న కలెక్టర్ సృజన

● జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు (అర్బన్): అబ్బాయిలతోపాటు అమ్మాయిలను సమానంగా చదివించాలని తల్లిదండ్రులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. చదువుతో ఆడపిల్లలో ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. బుధవారం స్థానిక జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఆడపిల్ల అంటే కేవలం బానిసత్వం, బరువుగా చూసే మనస్తత్వం నుంచి బయటకు వచ్చే ప్రయత్నాల్లో భాగంగానే ఈరోజు జాతీయ బాలికా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ రోజు ప్రాముఖ్యతను గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలో భద్రత లేదని, కుటుంబం మీద ఆర్థిక భారం పడుతుందేమో అనే ఆలోచనతో భ్రూణ హత్యలు చేయిస్తున్నారని, ఇది నేరమని పేర్కొన్నారు. అమ్మాయిలు చదువుకుని తమ కాళ్ల మీద తాము నిలబడి రానున్న తరాలకు ధైర్యాన్ని ఇవ్వాలన్నారు. సీడబ్ల్యూసీ చైర్మన్ జుబేదా మాట్లాడుతూ.. జాతీయ బాలికా దినోత్సవాన్ని 2008 నుంచి నిర్వహిస్తున్నప్పటికీ సమాజంలో అనుకున్న స్థాయిలో మార్పు రాలేదన్నారు. ప్రతి రోజూ మహిళా దేవతలకు పూజిస్తారని, అయితే ఇంట్లో ఉన్న స్త్రీలకు మాత్రం ఎందుకు ప్రాముఖ్యత ఇవ్వరనేది ఇప్పటికీ ప్రశ్నార్థకంగా ఉందన్నారు. పాఠశాలల్లో ప్రైమరీ లెవల్ వరకు ఆడపిల్లలకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌హెచ్‌సీ చైర్మన్ మాధవీ శ్యామల మాట్లాడుతూ.. ఆడపిల్లలందరూ బాగా చదువుకుని ఉన్నత హోదాలో ఉండాలన్నారు. దిశ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ కుమారులకు అమ్మాయిలతో ఏ విధంగా ప్రవర్తించాలి, ఎటువంటి వారితో స్నేహం చేయాలి, ఏఏ అలవాట్లకు దూరంగా ఉండాలనే విషయాలను నేర్పాలన్నారు. అనంతరం ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమెంటోలు అందించారు. తదనంతరం 'నేటి ఆడపిల్ల.. రేపటి అమ్మ' అనే బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ వెంకటలక్ష్మమ్మ, పీసీ పీఎన్‌డీటీ నోడల్ అధికారి ప్రవీణ్ కుమార్, డెమో ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

ఓటు.. భవితకు చోటు


- ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం
- ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి
- 18 ఏళ్లు నిండితే ఎప్పుడైనా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు
- నేడు జాతీయ ఓటరు దినోత్సవం

మంచి పాలకులను ఎన్నుకోవాలన్నా.. రాష్ట్ర, దేశాభివృద్ధికి బాటలు వేసుకోవాలన్నా.. భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలన్నా.. ఓటే మూలం. ఐదేళ్ల పాటు పీఠంపై ఉండే పాలకులను ఎన్నుకునేందుకు రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కు ఇది. ఈ క్రతువులో దిగ్విజయంగా పాల్గొనాలంటే ఓటరు జాబితాలో పేరు ఉండాల్సిందే. ఇందుకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులు ఓటరుగా ఎప్పుడైనా నమోదు కావచ్చు.

కర్నూలు(సెంట్రల్): ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే నిర్ణేతలు. వారి మనోభావాలను ప్రకటించేందుకు ప్రజల చేతిలో ఉన్న ఏకైక పదునైన ఆయుధం ఓటు. ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండాలంటే.. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదై, ఓటు హక్కు వినియోగించుకోవాలి. వజ్రాయుధం లాంటి ఓటు హక్కుపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఎన్నికల సంఘం ఏటా జనవరి 25న 'జాతీయ ఓటరు దినోత్సవాన్ని' నిర్వహిస్తోంది. ఈ ఏడాది 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను..ఇందులో లాంటి సందేహం లేదు' అనే నినాదంతో ఓటరు దినోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసింది.

ఏడాదిలో ఎప్పుడైనా ఓటరు నమోదుకు అవకాశం

భారత రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన యువతీ, యువకులకు ఓటు హక్కు కల్పించింది. గతంలో జనవరి 1వ తేదీ నాటికి మాత్రమే 18 ఏళ్లు నిండిన వారికి ఓటు హక్కు ఇచ్చేవారు. అయితే గతేడాది నుంచి సంవత్సరంలో ఎప్పుడు 18 ఏళ్లు నిండితే అదే సమయం నుంచి ఓటును ఏపీ సీఈఓ సైట్ ద్వారా 365 రోజులపాటు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఏటా అక్టోబర్ – జనవరి మధ్యలో ఓటరు నమోదు సవరణ జాబితాను సిద్ధం చేస్తారు. అందులో 18 ఏళ్లు నిండి భారతీయులైన ప్రతి ఒక్కరూ ఓటు హక్కుకు నమోదు చేసుకోవచ్చు. భారతదేశ పౌరసత్వం కలిగి ఉండి విదేశాల్లో ఉండే వారు కూడా తగిన ఆధారాలు చూపి ఓటరుగా నమోదు కావచ్చు. గతంలో ఏటా ఒక్కసారి మాత్రమే ఓటరు సవరణ జాబితాను ఎన్నికల సంఘం ప్రకటించేంది. ప్రస్తుతం ఏడాదికి రెండుసార్లు ఓటరు సవరణ జాబితా ప్రకటిస్తున్నారు.



నేడు యువ ఓటర్లకు సన్మానం

జాతీయ ఓటరు దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా, డివిజన్, మండల, గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవగాహన కోసం 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను...అందులో సందేహం లేదు' అనే ప్రతిజ్ఞ కార్యక్రమాలు చేపట్టనున్నారు. కర్నూలులో ఓటు హక్కు వినియోగంపై విద్యార్థులు, యువకులతో ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కలెక్టరేట్, కొండారెడ్డి బురుజు,కేవీఆర్ కళాశాలల నుంచి ర్యాలీలు ప్రారంభమై జెడ్పీలో కలుస్తాయి. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఓటరు దినోత్సవంలో విద్యార్థులు, యువతీ, యువకులు పాల్గొంటారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేస్తారు. అంతేకాక కొత్తగా ఓటు నమోదు చేసుకున్న ఐదుగురు యువకులకు, ఐదుగురు సీనియర్ ఓటర్లకు సన్మానాలు చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

జిల్లాలో ఓటర్ల వివరాలు

మొత్తం ఓటర్లు:	20,14,797
మహిళలు	10,19,597
పురుషులు	9,94,885
ఇతరులు	312
వయస్సుల వారీగా..	
(సంవత్సరాలు)	ఓటర్ల సంఖ్య
18-19	42,506
20-29	4,08,817
30-39	5,69,162
40-49	4,24,506
80+	24,478
ఎన్‌ఆర్‌ఐ ఓటర్లు	111
సర్వీసు ఓటర్లు	1602
పీడబ్ల్యూడీ ఓటర్లు	22,863

క్లుప్తంగా

వేదపాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు కల్చరల్: శ్రీ కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు పూజ్య శంకర విజయేంద్ర సరస్వతి వారి పర్యవేక్షణలో రాష్ట్రంలో నిర్వహిస్తున్న వివిధ వేద పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కళాశాలలు, కోర్సుల వివరాలు https://kanchiintegratedpatasalas.com/admissions.php అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు వెంకటసుబ్రహ్మణ్యం 99693 21989, కృష్ణవేణి సుబ్రహ్మణ్యియన్ 90141 92313 నంబర్లను సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

విద్యుత్ టారిఫ్‌పై 29 నుంచి ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు కల్చరల్: ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటైల్ సరఫరా వ్యాపారానికి, సమగ్ర ఆదాయ అవశ్యకత, టారిఫ్ క్రాస్ సబ్సిడీ సర్ చార్జీల ప్రతిపాదనలకు సంబంధించి ఈనెల 29, 30, 31 తేదీల్లో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీఎస్పీడీసీఎల్ టారిఫ్ ప్రతిపాదనలను నవంబర్ 30వ తేదీన ఏపీ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్ (ఏపీఈఆర్సీ)కు సమర్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ప్రతిపాదనలు, ఏపీ జెన్కో ప్రతిపాదించిన ఆదాయ అవసరాలు, ధరలకు సంబంధించిన వివరాలపై సూచనలు, అభ్యంతరాలు, సలహాలపై ఏపీఈఆర్సీ వారు విశాఖపట్నం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయం సేకరణ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కర్నూలు టౌన్, కర్నూలు రూరల్ డివిజన్‌లకు సంబంధించి విద్యుత్ భవన్‌లోని సమావేశ మందిరంలో, నంద్యాల, డోన్, ఆదోని డివిజన్లకు సంబంధించి ఆయా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వారి కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

నగరపాలక ఉద్యోగులకు మెమోలు జారీ

కర్నూలు (టౌన్): స్థానిక పాతబస్టాండ్‌లోని నగరపాలక సంస్థకు చెందిన పెట్రోల్ బంకులో విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన ముగ్గురు ఉద్యోగులకు బుధవారం సాయంత్రం నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ మెమోలు జారీ చేశారు. సూపర్‌వైజర్లుగా పని చేస్తున్న టి.వెంకటేష్, ఎ.సురేష్, అలాగే ఎ 5 క్లర్కు షేకున్నీసా బేగం విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడం, సమయపాలన పాటించకపోవడం, రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో మెమోలు జారీ చేశారు.

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం

కర్నూలు సిటీ: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితమని జిల్లా ప్రజా రవాణా అధికారి టి.వెంకటరామం అన్నారు. ఏపీఎస్ఆర్టీసీ జోనల్ కార్యాలయంలో బుధవారం డ్రైవర్ల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ డిపోల మేనేజర్లు పాల్గొన్నారు.

నిఘా నీడలో ఇంటర్ ప్రాక్టికల్స్

- ఫిబ్రవరి 5 నుంచి 20 వరకు నిర్వహణ
- ఒకేషనల్‌కు 42, జనరల్‌కు 144 సెంటర్ల ఏర్పాటు
- నాన్ జంబ్లింగ్ విధానంలోనే పరీక్షలు
- హాజరుకానున్న 27,890 మంది విద్యార్థులు



దేవనకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని కెమిస్ట్రీ ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న జిల్లా వృత్తివిద్యాధికారి జమీల్ పాషా

కర్నూలు సిటీ: సీసీ కెమెరాల నిఘాతో ఈ ఏడాది ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఇంటర్మీడియట్ ఉత్తర్వులు బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. ఫిబ్రవరి 5 నుంచి వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలు మొదలు కానున్నాయి. మూడు స్పెల్స్‌లో ఈ పరీక్షలు 20 తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులకు వచ్చే నెల 10వ తేదీ నుంచి మార్చి 7 వరకు ప్రాక్టికల్ పరీక్షలు రెండు స్పెల్స్‌లో నిర్వహించనున్నారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఇంటర్మీడియట్ ప్రాంతీయ కార్యాలయంతో పాటు కమిషనర్ కార్యాలయంలో లైవ్ ఉండేలా ఏర్పాట్లు చేసి పర్యవేక్షించనున్నారు. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా నాన్ జంబ్లింగ్ విధానంలోనే ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. అదే విధంగా ఫిబ్రవరి 2, 3 తేదీల్లో పర్యావరణ విద్య, నైతిక విలువ పరీక్షలు జరపనున్నారు.

ఉమ్మడి జిల్లాలోనే పరీక్షలు..

జిల్లాల పునర్విభజన జరిగినా ఇంటర్ బోర్డు పూర్తి స్థాయిలో విభజన కాలేదు. దీంతో ఈ ఏడాది కూడా ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ప్రాక్టికల్, థీయరీ పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే నంద్యాల, కర్నూలు జిల్లాల్లో పరీక్షల నిర్వహణకు పరీక్ష కేంద్రాలను గుర్తించి వాటిని బోర్డు అధికారులకు ప్రతిపాదించి, ఆమోదం కూడా తీసుకున్నారు. ప్రతి కేంద్రాన్ని తనిఖీ చేసి, తగిన సదుపాయాలను కల్పించారు.

186 కేంద్రాల గుర్తింపు

ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీలు 318 ఉన్నాయి. వచ్చే నెల 5వ తేదీ నుంచి మొదలు కానున్న వొకేషనల్ ప్రాక్టికల్ పరీక్షలకు 42 కేంద్రాలను గుర్తించారు. వీటిలో కర్నూలు జిల్లాకు చెందిన 3,449 మంది, నంద్యాల జిల్లాకు చెందిన 2,318 మంది.. మొత్తం 5,767 మంది ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. అలాగే జనరల్ విద్యార్థుల కోసం 144 కేంద్రాలను గుర్తించారు. ఈ కేంద్రాల్లో 22,123 మంది ప్రాక్టికల్ పరీక్షలు రాయనున్నారు. కర్నూలు జిల్లాకు (92 కేంద్రాలు) చెందిన 14,534, నంద్యాల జిల్లాకు(52 కేంద్రాలు) చెందిన 7,589 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో ఎంపీసీ గ్రూప్ విద్యార్థులు 14,372(కర్నూలు 9750 మంది, నంద్యాల 4622 మంది), బైపీసీ గ్రూప్ విద్యార్థులు 7751 మంది(కర్నూలు 4784, నంద్యాల 2967 మంది) ఉన్నారు.

నిధుల ఖర్చు ఇలా..

పరీక్షల నిర్వహణకు కంటిన్‌జెన్స్ నిధులు వొకేషనల్‌కు ఒక్కో విద్యార్థికి రూ.20 చొప్పున, జనరల్ విద్యార్థికి ఫిజిక్స్, బొటనీలకి రూ.2, జూవాలజీకి రూ.4, కెమిస్ట్రీకి రూ.6 చొప్పున ఇవ్వనున్నారు. పరీక్ష కేంద్రాల్లో ఒక్కో రోజుకి చీఫ్ సూపరింటెండెంట్‌కు రూ.281.25, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు రూ.150, స్కిల్డ్ అసిస్టెంట్‌కు రూ.150, మ్యూజియం కీపర్, స్టోర్ కీపర్, గ్యాస్ కీపర్, హెర్బేరియం కీపర్‌లకు ఒక్కొక్కరికి రూ.102.50, ల్యాబ్ అసిస్టెంట్‌కి, వాటర్ బాయ్‌కి, స్వీపర్‌కి రూ.102.50 చొప్పున ఇవ్వనున్నారు. అయితే ఈ నిధులను ఖర్చు చేసిన తరువాత బిల్లులు పెడితేనే ఆయా కేంద్రాల ప్రిన్సిపాళ్లకు మంజూరు చేయనున్నారు. ప్రైవేట్ జూనియర్ కాలేజీలు మినహా మిగిలిన కాలేజీల్లో విద్యార్థుల నుంచి వసూలు చేసిన స్పెషల్ ఫీజు సొమ్ము నుంచి పరీక్షలకు ఖర్చు చేసుకోవచ్చని ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు స్పష్టం చేశారు.

పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించే ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లో 50 మంది విద్యార్థులకుపైగా ఉంటే ప్రాక్టికల్ పరీక్షలకు కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నాం. నాన్ జంబ్లింగ్ విధానంలో ఉమ్మడి జిల్లాలో పరీక్షలు జరుగనున్నాయి. వొకేషనల్ విద్యార్థులు 5,767 మంది, జనరల్ విద్యార్థులు 22,123 మంది పరీక్షలకు హాజరుకానున్నారు.

– గురవయ్య శెట్టి, ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి

ప్రాణాలను రక్షిస్తే పారితోషికం



డ్రైవర్లకు ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఓర్వకల్లు: కళ్లెదుట ప్రమాదం జరిగినప్పుడు మనకెందుకులే అని వదిలేయకుండా, ఆసుపత్రికి తీసుకెళితే ప్రభుత్వం పారితోషికం కూడా అందిస్తుందని కర్నూలు–కడప జాతీయ రహదారి ప్రాజెక్ట్ హెడ్ మదన్‌మోహన్ తెలిపారు. జాతీయ రహదారి భద్రత మాసాన్ని పురస్కరించుకొని బుధవారం నన్నూరు టోల్‌ప్లాజా వద్ద డ్రైవర్లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ డ్రైవర్లు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా రహదారి నియమాలను తప్పక పాటించాలన్నారు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు కేసులకు భయపడి క్షతగాత్రులను రక్షించేందుకు వెనుకంజ వేస్తున్నారన్నారు. అయితే రక్షించే వారిపై ఎలాంటి కేసులు ఉండవని, పైగా వారికి పారితోషికం కూడా లభిస్తుందన్నారు. అతివేగమే ప్రమాదాలకు కారణమని, మద్యం తాగి వాహనాలు నడపటం నేరమనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అనంతరం వైద్య శిబిరంలో బీపీ, షుగర్‌తో పాటు గుండె, నరాల సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్యం అందించారు. కార్యక్రమంలో మెయింటెనెన్స్ హెడ్ గౌరి నాయుడు, ఆపరేషన్ హెడ్ అరుణ్‌రాజ్, ప్లాజా మేనేజర్ రవిరంజన్, రూట్ ఆఫీసర్ కటారుకొండ రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.9 లక్షలు దోపిడీ

- సెట్‌లో చాగలమర్రి పోలీసులకు సమాచారం
- ముత్యాలపాడు బస్టాండు వద్ద అడ్డుకోబోయిన ఎస్‌ఐ
- పోలీసు జీపును ఇన్నోవాతో ఢీకొట్టి పరారైన దుండగుడు



దెబ్బతిన్న పోలీసు వాహనం

చాగలమర్రి: జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో మోటార్ సైకిల్‌పై ఇద్దరు వ్యక్తులు తీసుకు వెళుతున్న రూ.9 లక్షల నగదును గుర్తు తెలియని వ్యక్తి బుధవారం రాత్రి దోచుకుని ఇన్నోవా వాహనంలో పారిపోయాడు. వాహనం ఆళ్లగడ్డ వైపు నుంచి నర్సాపురం మీదుగా చాగలమర్రి వైపు వెళుతున్నట్లు గుర్తించి నంద్యాల పోలీసులు సెట్‌లో చాగలమర్రి ఎస్‌ఐ రమణయ్యకు సమాచారం అందించారు. దీంతో అప్రమత్తమైన ఎస్‌ఐ రమణయ్య సాహసించి చాగలమర్రిలోని ముత్యాలపాడు బస్టాండు సమీపంలో రోడ్డుపై పోలీసు వాహనంతో అడ్డగించారు. అయితే దుండగుడు ఇన్నోవా వాహనంతో పోలీసు జీపును ఢీ కొట్టి పరారయ్యాడు. నిందితుడిని పట్టుకునేందుకు ఎస్‌ఐ రమణయ్య మరో వాహనంతో అతన్ని వెంబడించాడు. వైఎస్సార్ జిల్లా దువ్వూరు, రాజుపాళెం, ప్రొద్దుటూరు వరకు వెంబడించి.. ఆతర్వాత ఇన్నోవా వాహనం ఆచూకీ తెలియకపోవడంతో వైఎస్సార్ జిల్లా ఎస్పీకి, ఆయా ప్రాంతాల పోలీసు స్టేషన్‌లకు సమాచారం అందించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

వాహన చట్టాలపై విస్తృత అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కె.మధుసూధన్‌రావు

కర్నూలు(సెంట్రల్): వాహన చట్టాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని డీఆర్వో కె.మధుసూధన్‌రావు అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి రోడ్డు భద్రతా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి భద్రత సమావేశాల్లో తీసుకున్న తీర్మానాలను తప్పనిసరిగా అమలు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జాతీయ రహదారి ఓర్వకల్ సమీపంలో అండర్‌పాస్, జగనన్న కాలనీకి సర్వీసు రోడ్డు నిర్మించాలని జాతీయ రహదారుల ప్రాజెక్టు అధికారులను ఆదేశించారు. వెంకాయపల్లె ఎల్లమ్మ గుడి సమీపంలో అండర్ పాస్ నిర్మాణ పనులు ఎంతవరకు వచ్చాయని వివరణ కోరగా.. నాలుగు లేన్ల జాతీయ రహదారి పనులు కొనసాగుతున్నాయని, పూర్తికాగానే నిర్మాణానికి చర్యలు తీసుకంటామని అధికారులు చెప్పారు. నగరంలో నిర్మాణంలోని బస్ షెల్టర్లను త్వరగా పూర్తి చేయాలన్నారు, రోడ్డు ఆక్రమణలను తొలగించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. డీటీసీ శ్రీధర్ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 19వ తేదీ వరకు జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, ఆర్‌టీఓ రమేష్, ట్రాఫిక్ డీఎస్పీ ఎం.నాగభూషణం, ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి, ఎమ్మిగనూరు డీఎస్పీ సీతారామయ్య పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి స్థల పరిశీలన

డోన్ టౌన్: పట్టణంలోని కోర్టు భవనాల సముదాయం వెనుక ఉన్న స్థలాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు బుధవారం పరిశీలించారు. డోన్‌కు మంజూరైన సబ్ కోర్టుతో పాటు ఫోర్త్ కోర్టు భవన నిర్మాణాలకు ఈనెల 27న భూమి పూజ చేయనున్నారు. అందులో భాగంగా ఆయన స్థానిక న్యాయమూర్తులతో కలిసి స్థలాన్ని పరిశీలించి ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ భూమి పూజా కార్యక్రమానికి హైకోర్టు జడ్జిలు హాజరు కానున్నట్లు తెలిపారు. ఆయన వెంట సీనియర్ సివిల్ జడ్జి తంగమణి తదితరులు ఉన్నారు.

వలంటీర్లతో పేదలకు ఎంతో మేలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఆసరాగా నిలిచేందుకు వలంటీర్లను ఏర్పాటు చేశారు. కొన్నాళ్ల క్రితం నా భార్య మరణించింది. ఇద్దరు కొడుకులు పట్టించుకోలేదు. హోటల్‌లో పని చేసుకుంటూ బతుకేవాడిని. నాకు ఆధార్, రేషన్, ఓటరు కార్డు లేక పోవడంతో పింఛన్ కూడా వచ్చేది కాదు. మా వలంటీర్ మహబూబ్‌బాషా నా సమస్యను గుర్తించి అన్నింటికీ దరఖాస్తు చేయించాడు. ఆరు నెలల క్రితం నాకు పింఛన్ మంజూరయ్యింది. ఇప్పుడు రూ. 3 వేలు వస్తున్నాయి. నాకు చాలా సంతోషంగా ఉంది. వలంటీర్లు ఉండటంతో అధికారుల చుట్టూ తిరిగే పని లేకుండానే పనులు పూర్తవుతున్నాయి.

– గాలయ్య, జూపాడుబంగ్లా గ్రామం



ఇచ్చిన హామీని నెరవేర్చాడు



పదేళ్ల నుంచి ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నా. ఆటో రిపేర్లకు, ఇన్సూరెన్స్ కట్టడానికే సరిపోయేది. కుటుంబం గడవడం కష్టంగా ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా సంకల్ప పాదయాత్రలో మా ఆటో డ్రైవర్ల ఇబ్బందులను గమనించారు. అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాతట మేరకు ఏటా రూ.10 వేల ఆర్థికసాయం చేస్తున్నారు. ఆ డబ్బు కూడా నేరుగా మా అకౌంట్లలోనే జమ అవుతోంది. ఆటో మరమ్మతులు, ఇన్సూరెన్స్ అవసరాలకు ఉపయోగపడుతోంది. ఆపదలో ఆదుకుంటున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– షేక్ లాలుమియ్య, ఆటో డ్రైవర్, గడివేముల గ్రామం

ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీ పోచా

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఫైనల్ మ్యాచ్‌లో బాలుర విభాగంలో గుంటూరు జిల్లాపై ఈస్ట్ గోదావరి విజేతగా నిలిచింది. బాలికల విభాగంలో శ్రీకాకుళం జిల్లాపై కృష్ణా జిల్లా జట్టు గెలుపొందిందని కబడ్డీ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ ఏపీ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ జాకీర్‌హుసేన్ తెలిపారు. మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యలమంచిలి శ్రీకాంత్, ఉపాధ్యక్షులు దండె నాగరాజు, సురేష్ నాయుడు, మల్లిఖార్జున, కౌన్సిలర్ సరస్వతమ్మ, సుభాన్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీల బిడ్డలకు ‘ఉన్నతి’

- వంద పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలకు భరోసా
- కుటుంబ సభ్యుల్లో విద్యావంతులకు ఉద్యోగాల కల్పనకు చర్యలు
- దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌలస్య యోజన ద్వారా వివిధ కోర్సుల్లో శిక్షణ
- శిక్షణా కాలంలో అభ్యర్థులకు భోజనంతో పాటు వసతి

జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్నాయి. ఉపాధి కూలీల ఇళ్లలోని విద్యావంతులకు ఉన్నతి పథకం కింద నైపుణ్యాలను మెరుగుపరిచి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాయి. వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్న కూలీల పిల్లలకు కేంద్రం ప్రభుత్వ భాగస్వామ్యంతో మెరుగైన శిక్షణ ఇచ్చే ఉన్నతి పథకాన్ని రాష్ట్రప్రభుత్వం పక్కాగా అమలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తోంది.



యువతీ, యువకులకు నైపుణ్యాభివృద్ధి కోర్సుల్లో శిక్షణ ఇస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: జిల్లాలో 4.38 లక్షల జాబ్‌కార్డులు కలిగిన కుటుంబాల్లో 8.70 లక్షల మంది కూలీలున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి 2.29 లక్షల కుటుంబాల్లోని 4.21 లక్షల మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. ఉపాధి పథకం కింద వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని విద్యావంతులతోపాటు అర్హులైన యువతీయువకులకు ఉన్నతి పథకం ద్వారా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు.

పకడ్బందీగా లబ్ధిదారుల గుర్తింపు

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 7,300 కుటుంబాలు వంద పనిదినాలు పూర్తి చేసుకున్నాయి. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఆ కుటుంబాల్లోని విద్యావంతులను గుర్తించి వివిధ కోర్సుల్లో నైపుణ్యాభివృద్ధికి శిక్షణ ఇచ్చే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. ఎంపికైన అభ్యర్థులకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన(డీడీయూజీకేవై) కింద పలు సాంకేతిక కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆటోమోటివ్ ప్రొడక్ట్ డిజైన్ లీడ్ ఇంజినీర్, క్యాడ్ టెక్నీషియన్, సేల్స్ సూపర్‌వైజర్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్ అసెంబుల్ ఆపరేటివ్, డెస్కటాప్ పబ్లిషింగ్, డేటా ఎంట్రీ టెక్నికల్, తదితర కోర్సులతోపాటు సాఫ్ట్‌స్కిల్స్, కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లలో శిక్షణ ఇస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఉపాధి హామీ పథకంలో వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కుటుంబాల్లోని విద్యావంతులకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు.



కర్నూలు తాండ్రపాడు వద్ద డీఆర్‌డీఏ కార్యాలయంలో శిక్షణ తీసుకుంటున్న విద్యావంతులైన యువతులు

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ

డీడీయూజీకేవై కింద శిక్షణ పొందేందుకు పదో తరగతి ఆపై చదువులు అభ్యసించి 45 ఏళ్లలోపు వయస్సు పురుష, మహిళలు అర్హులు. జిల్లాలో ఇప్పటికే తొలి విడత అభ్యర్థులను ఎంపిక చేసి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 30 నుంచి 35 మందికి శిక్షణ ఇచ్చేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఎంపిక చేసుకున్న కోర్సును బట్టి మూడు నెలల నుంచి ఆరునెలల వరకు శిక్షణ ఉంటుంది. శిక్షణా కాలంలో రూ.272 చొప్పున భృతి , ఉచిత వసతి, మూడు పూటలా భోజనం, దుస్తులు, పుస్తకాలతో పాటు ఉచిత వైద్య సదుపాయం అందిస్తున్నారు. శిక్షణ పూర్తి కాగానే ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

ఉద్యోగ అవకాశాలకు ఉపయోగం



డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నారు. రీటైల్ సేల్స్‌సూపర్‌వైజర్‌గా శిక్షణ తీసుకుంటున్నాను. నిరుద్యోగ యువతి, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఉన్నతి పథకాన్ని అమలు చేస్తోంది. మూడు పూటలా భోజనం పెడుతూ హాస్టల్, భృతి ఇస్తున్నారు. శిక్షణ కూడా చాలా బాగుంది. మా లాంటి నిరుపేద, సామాన్య, మధ్యతరగతి కుటుంబాలకు ఇలాంటి కోర్సుల ద్వారా ఉద్యోగాలు దొరికే ఆస్కారం ఉంది.

– సోనియా, చాకరాజువేముల, దొర్నిపాడు మండలం

విద్యావంతులకు శిక్షణ



ఉపాధి హామీ పథకం ద్వారా వంద పనిదినాలు పూర్తి చేసుకున్న కుటంబాలతోపాటు విద్యావంతులైన యువతీయువకులకు డీఆర్‌డీఏ ద్వారా శిక్షణ ఇస్తున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం మేరకు ఆసక్తి ఉన్న అర్హులందరికీ వివిధ కోర్సుల్లో నైపుణ్యాలు మెరుగు పడేలా ప్రత్యేక శిక్షణ కార్యక్రమం కొనసాగుతోంది. వంద పనిదినాలు పూర్తి చేసుకున్న ఉపాధి కుటుంబాల్లోని విద్యావంతులు ఉన్నతి పథకాన్ని సద్వినియోగం చేసుకుని ఉద్యోగావకాశాలు పొందాలి.

– గురుస్వామి, వైకేపీ ఏరియా కో ఆర్డినేటర్, కోవెలకుంట్ల

ఊపందుకున్న కులగణన

- నగరంలో మొత్తం 1,43, 554 ఇళ్లు
- ఐదురోజుల్లో 85,063 కుటుంబాల వివరాలు సేకరణ
- సర్వేకు సహకరిస్తున్న ప్రజలు
- నగరపాలక అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్



50వ వార్డు కొత్తపేటలో కులగణన సర్వే చేస్తున్న 127వ సచివాలయ ఉద్యోగులు



నరసింగరావుపేటలో కుటుంబ వివరాలు సేకరిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన ఊపందుకుంది. కర్నూలు నగరంలో ఈనెల 20న సర్వే ప్రారంభమైంది. 133 సచివాలయాల పరిధిలో ఎన్యుమరేటర్లుగా ఉన్న సచివాలయాల ఉద్యోగులు ఇంటింటికి వెళ్లి కులగణన చేస్తున్నారు. ప్రజల నుంచి సమగ్ర సమాచారాన్ని సేకరిస్తున్నారు. కుటుంబ పెద్ద, ఇంటి సభ్యులు, నివాసం, ఆర్థిక స్థితి, కులం, ఉపకులం, ఆధార్ కార్డు వివరాలు కుటుంబ సభ్యుల సమాచారం నమోదు చేస్తున్నారు. కుటుంబ యజమాని బొటన వేలు ముద్ర కూడా తీసుకుంటున్నారు. దేశంలో చివరి సారిగా 1931లో కులగణన జరిగింది. మళ్లీ 93 ఏళ్ల తర్వాత ఏపీలో వైఎస్ జగన్ సర్కారు కులగణనకు శ్రీకారం చుట్టడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సగానికిపైగా కుటుంబాల సర్వే పూర్తి

కర్నూలు, పాణ్యం అర్బన్, కోడుమూరు అర్బన్ పరిధిలోని కుటుంబాలను 2,180 క్లస్టర్లుగా కేటాయించారు. ప్రతి సచివాలయం పరిధిలో జరుగుతున్న ఈ సర్వేలో సూపర్‌వైజర్లు, ఇరువురు సహాయకులను మున్సిపల్ అధికారులు నియమించారు. నగరంలో మొత్తం 1,43,554 కుటుంబాలు ఉన్నాయి. ఆ కుటుంబాల్లో మొత్తం 4,73,876 మంది సభ్యులు ఉన్నారు. వీరి సమగ్ర సమాచార సేకరణకు ఈనెల 20న సర్వే ప్రారంభమైంది. అంటే బుధవారానికి ఐదురోజులైంది. ఈ ఐదురోజుల్లో 85, 063 కుటుంబాలు, 2, 25,022 మంది సభ్యుల వివరాలను ఎన్యుమరేటర్లు నమోదు చేశారు. రోజు వారి ప్రగతిని నగరపాలక ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. నగరపాలక కమిషనర్, అడిషనల్ కమిషనర్ నేరుగా ఇళ్ల వద్ద సర్వే చేస్తున్న సచివాలయాల సిబ్బందితో మాట్లాడుతున్నారు. అత్యంత ప్రాధాన్యత క్రమంలో ఈ సర్వే చేపట్టాలని ఇప్పటికే అధికారులు ఆదేశాలు జారీ చేశారు. దీంతో నిర్ణీత గడువులోపు పూర్తి చేసేందుకు ఉదయం నుంచి చీకటి పడేంత వరకు కులగణన సర్వే చేస్తున్నారు. వంద శాతం సర్వే పూర్తి అయితే నగర ప్రజల ఆర్థిక స్థితిగతులు, కులాల వారీగా వివరాలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. తద్వారా ఆయా వర్గాలకు న్యాయం చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ సర్వే చేస్తోంది.

కుటుంబ యజమానితో ఈకేవైసీ

కులగణన నగరంలో పకడ్బందీగా జరుగుతోంది. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు నేరుగా ప్రజల ఇళ్ల వద్దకు వెళ్తున్నారు. అక్కడ కుటుంబ వివరాలు, ఇతర వివరాలను కుటుంబ పెద్ద లేదా ఎవరైనా ఒకరు తెలియజేస్తున్నారు. ఎన్యుమరేటర్లు ఆ వివరాలను యాప్‌లో నమోదు చేసుకొని మొదట వారు ఈకేవైసీ వేస్తున్నారు. తరువాత వివరాలు చెప్పిన వ్యక్తి నుంచి ఈకేవైసీ వేయించుకుంటున్నారు. కాగా, ఈకేవైసీకి ముందు ఏమైనా తప్పులుంటే సరి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని ఎన్యుమరేటర్లు తెలిపారు.

59. 26 శాతం సర్వే పూర్తి



నగరంలోని 52 వార్డుల్లో కులగణన సర్వేను సచివాలయాల ఉద్యోగుల ద్వారా చేపడుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రాధాన్యత క్రమంలో ప్రతి కుటుంబం వివరాలు, ఆర్థిక స్థితి గతులు, కులం వివరాలు సేకరిస్తున్నాం. ఈనెల 28 వ తేదీ వరకు సర్వే గడువు ఉంది.అయితే మరో 5 రోజులు అదనంగా గడువు పొడిగించారు. ఇప్పటి వరకు నగరంలో 59. 26 శాతం సర్వే పూర్తి చేశాం. ప్రజల సహకారంతో నిర్దేశించిన గడువులోపు ఈప్రక్రియను పూర్తి చేస్తాం.

– రామలింగేశ్వర్, నగరపాలక అడిషనల్ కమిషనర్

క్లుప్తంగా

రేపు జంతు వధ నిషేధం

కర్నూలు (టౌన్) : ఈనెల 26 వ తేదీ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలో మాంసం దుకాణాలు మూసి వేయాలని నగర పాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడ కూడా జంతువులను వధించరాదని హోటళ్లు, రెస్టారెంట్లలో మాంసం విక్రయించరాదని తెలిపారు. ఈ నియమాన్ని అతిక్రమించిన వారిపై జరిమాన విధించి వారి వ్యాపార లైసెన్సులు రద్దు చేయడంతో పాటు చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

బాలికల పట్ల వివక్ష చూపకూడదు



అనాథాశ్రమానికి నిత్యావసర వస్తువులు అందజేస్తున్న డాక్టర్ శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): సమాజంలో బాలికల పట్ల వివక్ష చూపకూడదని, పురుషులతో సమానంగా స్త్రీలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఏ దేశమైనా అభివృద్ధి చెందుతుందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి. శంకరశర్మ అన్నారు. జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన కీర్తన అనాథాశ్రమానికి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తల్లి గర్భంలో ఉన్న దశ నుంచే ఆడపిల్ల పట్ల సమాజంలో వివక్ష నెలకొనడం దురదృష్టకరమన్నారు. పురుషులతో సమానంగా స్త్రీలను గౌరవించడం నేర్చుకోవాలన్నారు. బాలికా విద్యను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని చెప్పారు. కార్యక్రమంలో అనాథాశ్రయం నిర్వాహకుడు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

టీపీఎస్ చౌదరి బదిలీ

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న హరీష్ చౌదరి బదిలీ అయ్యారు. ఆయనను అనంతపురం, హిందూపురం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఆహుడా)కి బదిలీ చేస్తు బుధవారం సాయంత్రం పట్టణ ప్రణాళిక విభాగం రాష్ట్ర సంచాలకులు ఆర్.జె. విద్యుల్లత ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటేషన్‌పై ఏడాది పాటు ఆయన అక్కడ పనిచేయాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటేషన్ ముగిసిన తరువాత తిరిగి ఆయన నగరపాలక పాలక సంస్థ పట్టణ ప్రణాళిక విభాగంలో టీపీఎస్ బాధ్యతలు చేపడతారని తెలిపారు.

నూతన కల్వర్టు ఏర్పాటు చేయాలని వినతి



మేయర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

కర్నూలు కల్చరల్: వీకర్ సెక్షన్ కాలనీలోని శ్రీరేణుక ఎల్లమ్మ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో దేవాలయం పక్కన నూతన కల్వర్టు ఏర్పాటు చేయాలని నగర మేయర్ బీవై రామయ్యకు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అధికారులు నిర్లక్ష్యం వీడి సమస్య ను పరిష్కరించాలని లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కమిటీ అధ్యక్షుడు దాదే పోగు అయ్యన్న, ఉపాధ్యక్షులు చంద్ర, సభ్యులు రాజు, అజయ్‌బాబు, శివకుమా ర్, సుధాకయ్య, బజరంగ్‌దల్ రాష్ట్ర కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి వినతిపత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

రైతు సుభిక్షంగా ఉండాలి



రైతన్న డైరీని ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్): రైతులు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నట్లు రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. బుధవారం సీఆర్ భవన్‌లో ఏపీ రైతుసంఘం రూపొందించిన రైతన్న డైరీని విష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతుల కోసం పనిచేసే సంఘాలకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను విరివిగా ఆదుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.జగన్నాథం, పంపన్నగౌడ్ పాల్గొన్నారు.

నేడు జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ

కర్నూలు (టౌన్): జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం నగరంలో జాతీయ ఓటరు దినోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ ఎలక్ట్రోరోల్ రిజిస్ట్రేషన్ అధికారి, నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక సి. క్యాంపు సెంటర్ నుంచి పాతబస్టాండ్, కొండారెడ్డి బురుజు , కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, జిల్లా పరిషత్తు కార్యాలయం వరకు యువకులు, విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ర్యాలీలో పాల్గొని జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నెరవేరుతున్న రహదారి కల

పాణ్యం : మండల పరిధిలోని నెరవాడ గ్రామ ప్రజల ఏళ్ల నాటి కల సకారమవుతోంది. నెరవాడ మెట్ట నుంచి గ్రామం మీదుగా పుట్టాలమ్మ గుడి వద్దకు ఉన్న ప్రధాన రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడేవారు. బుధవారం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి నూతన రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నెరవాడ ప్రజల రెండు ప్రధాన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. రైల్వే డబుల్‌లేన్‌లో భాగంగా బ్రిడ్జి కింద నీటి ప్రవాహం లేకుండా అండర్ డ్రైనేజీ నిర్మించాలని రైల్వే డీఆర్‌ఎం మనీష్ అగర్వాల్, జీఎం అరుణ్‌కుమార్ జైన్‌తో కలిసి వివరించినట్లు తెలిపారు. ఈ మేరకు నెరవాడ రైల్వే బ్రిడ్జి కింద అండర్ డ్రైనేజీ నిర్మాణం పనులకు రైల్వే శాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారన్నారు.

3.5 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం

హైవే నుంచి పుట్టాలమ్మ వరకు దాదాపుగా 3కిలోమీటర్ల మేర రోడ్డు దెబ్బతినడం వలన ప్రజలు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్న విషయం స్థానిక నాయకులు తన దృష్టికి తెచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. దీంతో రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేయించి నిధులు విడుదల చేయించినట్లు తెలిపారు. పీఐయూ నిధులు రూ. 2.70కోట్లుతో 3.5 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు వేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, సర్పంచ్ లింగాల శారదమ్మ, వైస్ ఎంపీపీ పార్వతమ్మ, రాంభూపాల్‌రెడ్డి, శివారెడ్డి, ప్రతాప్ రెడ్డి, పీఆర్ ఏఈ మహబూబ్‌బాషా, మహానందిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించండి

- గ్రీన్‌కో, అదానీ కంపెనీలకు కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచన



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జి.సృజన, చిత్రంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

కర్నూలు(సెంట్రల్): సామాజిక బాధ్యతగా సోలార్ పార్కు ఏరియాలోని గ్రామ పంచాయతీల్లో అభివృద్ధి పనులకు నిధులను కేటాయించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన గ్రీన్‌కో, అదానీ కంపెనీలకు సూచించారు. వార్షిక టర్నోవర్‌లో రెండు శాతం నిధులను సమకూర్చాలన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మెగా సోలార్ పార్కు లోకల్ ఏరియా డెవలప్‌మెంట్ కమిటీ 14వ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2016 నుంచి సోలార్ విద్యుత్ సంస్థ చేపట్టిన పలు అభివృద్ధి పనులపై విపులంగా కలెక్టర్ సృజన, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పీఆర్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన రూ.27 కోట్ల పనులకు సంబంధించిన యూసీ (యూటిలైజేషన్ సర్టిఫికెట్) సమర్పించాలన్నారు. నిర్మాణంలో రూ.5 కోట్ల పనులను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రూరల్ వాటర్ స్కీంకు సంబంధించిన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈడబ్ల్యూఐడీసీ విభాగానికి చెందిన పది పనులను రూ.45.5 లక్షలతో పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో సీపీఓ హిమ ప్రభాకర రాజు, పీఆర్ ఎస్ఈ సుబ్రమణ్యం, ఈఈ మద్దన్న, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

టీకాలతో చిన్నారుల జీవితానికి రక్ష



వ్యాక్సిన్ నిల్వల గురించి అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): క్రమం తప్పకుండా టీకాలు వేయించడం వల్ల చిన్నారుల జీవితానికి రక్ష ఏర్పడుతుందని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక ఇల్లూరు నగర్ యుపీహెచ్‌సీ, మార్కెట్ యార్డులో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం, వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు, వ్యాక్సిన్ల నిల్వ ఉండే శీతలీకరణ పరికరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఏఎన్ఎంలు తమ పరిధిలోని అర్హులైన చిన్నపిల్లలందరికీ సమయానుసారంగా వ్యాక్సిన్‌లు ఇవ్వాలని చెప్పారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి వారితో చర్చించారు. గర్భిణిలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్-ఎ సిరప్‌లను పంపిణీ చేశారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులో అందిస్తున్న ఆరోగ్యసేవలను ఉపయోగించుకుని అందరూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నాగసౌమ్య, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల రాజకీయ పితామహుడు కర్పూరి ఠాగూర్



కర్పూరి ఠాగూర్‌కు నివాళులర్పిస్తున్న బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి నాయకులు

కర్నూలు (అర్బన్): బీసీల రాజకీయ పితామహులు కర్పూరి ఠాగూర్ అని బీసీ రిజర్వేషన్ల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల లక్ష్మీకాంతయ్య అన్నారు. బుధవారం స్థాని బీసీ భవన్‌లో కర్పూరి ఠాగూర్ శత జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ సంఘం, నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ బిహార్ రాష్ట్రానికి చెందిన మాజీ ముఖ్యమంత్రి కర్పూరి ఠాగూర్ ఎంబీసీలోని నాయీ బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందినవారన్నారు.. బిహార్ రాష్ట్రంలో బీసీలకు రాజకీయ పునాదులు నిర్మించిన మహానేత ఠాగూర్, లల్లుప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్‌కు ఠాగూర్ రాజకీయ గురువు అని తెలిపారు. ఠాగూర్ జననాయక్‌గా దేశ వ్యాప్తంగా ప్రసిద్ధికెక్కారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు ధన విజయుడు, పోలీస్ వెంకటస్వామి, మద్దిలేటి రాఘవేంద్ర, బీసీ నాయకులు శివశంకర్, చంద్రికమ్మ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై పోలీసుల దాడులు



బంగారుపేటలో స్వాధీనం చేసుకున్న నాటుసారాతో పోలీసులు

కర్నూలు: సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సారా తయారీ, విక్రయాలు, రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సబ్ డివిజన్ అధికారుల నేతృత్వంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లాలో ఎక్కడైనా నాటుసారా, మద్యం అక్రమ రవాణా జరుగుతుంటే ప్రజలు డయల్ 100కు గాని, స్థానిక పోలీసులకు గాని సమాచారం అందించాలని సబ్ డివిజన్ అధికారులు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బంగారుపేటలో...

కర్నూలు నగరంలోని బంగారుపేటలోని నాటుసారా స్థావరంపై కర్నూలు డీఎస్పీ విజయశేఖర్ ఆధ్వర్యంలో రెండో పట్టణ పోలీసులు దాడులు నిర్వహించారు. బుధవారం ఉదయం పెద్ద ఎత్తున పోలీసులు బుధవారపేటకు చేరుకుని కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పోలీసులు మొత్తం రెండు బృందాలుగా ఏర్పడి ఆనంద్ టాకీస్ వైపు నుంచి మరో బృందం, ఇరిగేషన్ కార్యాలయం నుంచి కేసీ కెనాల్ వెంట తనిఖీలు నిర్వహించి సారా బట్టీలను ధ్వంసం చేశారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్ దాడుల్లో మొత్తం 1200 లీటర్ల నాటుసారా బెల్లం ఊటను ధ్వంసం చేసి 130 లీటర్ల నాటుసారా, 500 కేజీల నల్ల బెల్లం స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐలు ఖాన్, ప్రేమ పాల్గొన్నారు.

కైరుప్పల గ్రామంలో...

పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో ఆస్పరి యూపీఎస్ పోలీసులు కైరుప్పల గ్రామంలో నాటుసారా స్థావరాలపై దాడులు నిర్వహించారు. కార్డన్ సెర్చ్ ఆపరేషన్ దాడుల్లో 100 లీటర్ల సారా బెల్లం ఊటను ధ్వంసం చేసి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.దేవనకొండ, ఆస్పరి సీఐలు శ్రీనివాసులు, హనుమంతప్ప,ఎస్ఐ ఓబులేసు తనిఖీల్లో పాల్గొన్నారు.

అవీ-ఇవీ

కలెక్టర్, ఎస్పీని కలిసిన కుడా చైర్మన్

కర్నూలు సిటీ: జిల్లా కలెక్టర్ డా.జి సృజన, ఎస్పీ కృష్ణకాంత్‌ను బుధవారం కుడా చైర్మెన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని వివిధ అభివృద్ధి పనులు, పెండింగ్ పనుల గురించి కలెక్టర్‌కు వివరించారు. రాబోయే ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరారు.

గెలుపోటములు సమానంగా స్వీకరించాలి

కల్లూరు: క్రీడల్లో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని ఎంపీడీఓ రమణమూర్తి అన్నారు. మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల్లో సల్కాపురం గ్రామ సచివాలయానికి చెందిన కబడ్డీ (బాలికల జట్టు) నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది. బుధవారం ఓర్వకల్లు మండలం కేంద్రంలో నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో గడివేముల మండలానికి చెందిన జట్టు, కల్లూరు మండలానికి చెందిన జట్టు తలపడ్డాయి. ఈ పోటీలో గడివేముల జట్టు విజేత కాగా సల్కాపురం జట్టు రన్నర్‌గా నిలిచింది. నియోజకవర్గ స్థాయిలో రన్నర్‌గా నిలిచిన కబడ్డీ జట్టును ఎంపీడీఓ రమణమూర్తి తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో సల్కాపురం సర్పంచ్ మద్దిలేటి, పెద్దటేకూరు ఎంపీటీసీ మునిస్వామి, పంచాయతీ కార్యదర్శులు ఉమాదేవి, శ్రీనివాసులు, శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

కర్నూలు(సెంట్రల్): ఈనెల 28నుంచి నెల్లూరులో జరిగే యూనైటెడ్ ఎలక్ట్రీసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు.బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలన్నారు. షిఫ్ట్ ఆపరేటర్లుగా పనిచేస్తున్న కొత్తవారికి పాతవారితో సమానంగా వేతనాలు ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకుడు చలపతి పాల్గొన్నారు.

బాధిత రైతులను ఆదుకోవాలి

కర్నూలు(సెంట్రల్): గ్రీన్ కో కంపెనీ కరెంట్ స్తంభాలను రైతుల పొలాల్లో నాటుతుండడంతో పంటలు దెబ్బతిని తీవ్ర నష్టం జరుగుతోందని, బాధిత రైతులను కంపెనీ ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కల్లూరు, వెల్దుర్తి మండలాల్లోని ఎర్రకత్వ, పుల్లగుమ్మి, అల్లుగుండు గ్రామాల రైతుల పొలాల్లో నాటిన కరెంట్ స్తంభాలను పరిశీలించారు. స్తంభాలను నాటడం ద్వారా నష్టపోయిన వారికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట నాయకులు జి.రామకృష్ణ, కె.ప్రభాకర్, మధు ఉన్నారు.

సాధనతో క్రీడల్లో రాణింపు

కర్నూలు (టౌన్) : ఎంచుకున్న క్రీడల్లో ప్రతిరోజూ ఒక గంటపాటు సాధన చేస్తే రాణించవచ్చునని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాస రావు అన్నారు. బుధవారం సాయంత్రం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జాతీయ స్థాయి రూలర్ ఫుట్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్న జట్టును డీఎస్‌డీఓ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27, 28, 29 తేదీల్లో తెలంగాణలోని షాద్ నగర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి రూలర్ ఫుట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటాలన్నారు. అనంతరం ఆయన రూలర్ ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్‌ను కలిసి క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేశారు.

పిల్లలను ప్రోత్సహించాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి, తదితరులు

కర్నూలు కల్చరల్: తమ పిల్లల లక్ష్య సాధనకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని దిశా పోలీస్ స్టేషన్ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం ఆధ్వర్యంలో కేవీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జాతీయ బాలికా దినోత్సవ పోస్టర్ల ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ బాలికలను బాగా చదివించాలని సూచించారు. విద్యార్థినులు ధైర్యంగా, దృఢంగా ఆరోగ్యంగా ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. బాలికాలు ఆపదలో ఉన్నప్పుడు సహాయం కోసం డయల్ 100, ఉమెన్ హెల్ప్‌లైన్ 181, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 నంబర్లకు ఫోన్ చేస్తే సంబంధిత అధికారులు వెంటనే స్పందించి న్యాయం చేస్తారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ లాలప్ప, దిశా పోలీస్ స్టేషన్ ఎస్ఐ మమత, సీడబ్ల్యూసీ సభ్యులు సంజీవరెడ్డి, జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం అధ్యక్షుడు విజయరాజు, సభ్యులు మద్దిలేటి, కన్వీనర్ చిన్నయ్య, అధ్యాపకులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించవచ్చు



విద్యార్థినులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ విజయ జ్యోతి కుమారి

కల్లూరు: బాలికలు న్యూనతా భావాని వదిలితే అన్ని రంగాల్లో రాణించవచ్చని సమగ్ర శిక్ష ఏపీసీ సీహెచ్ విజయ జ్యోతి కుమారి అన్నారు. బుధవారం జాతీయ బాలిక దినోత్సవం సందర్భంగా లక్ష్మీపురంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో జీసీడీఓ సునీతతో కలసి ఎనిమిదవ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల స్టోర్ రూమ్‌లో ఉన్న వస్తువులను పరిశీలించి,అరటి పండు, గుడ్డును తూకం వేసి బరువు చూశారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డిస్తున్నారా అని తెలుసుకుని, విద్యార్థులతో కలసి మధ్యాహ్నం భోజనం చేశారు. ఏపీసీ మాట్లాడుతూ బాలికలు చదులతో పాటు మానసికంగా దృఢంగా ఉండాలన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేల ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబర్చిన పాఠశాలకు చెందిన విద్యార్థిని సాయిప్రియను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బి.క్యాంప్ క్వార్టర్స్‌లో అగ్నిప్రమాదం

కర్నూలు : నగర శివారులోని బి.క్యాంప్ క్వార్టర్స్‌లో పంచాయతీరాజ్ శాఖ జూనియర్ అసిస్టెంట్ వీరేష్ నివాసముంటాడు. బుధవారం ఆయన విధులకు వెళ్లిన తర్వాత ఇంట్లో విద్యుదాఘాతం ఏర్పడి మంటలు వ్యాపించాయి. బీరువాతో పాటు ఫ్రిడ్జ్, వస్తువులు, ఇతర సామగ్రి మంటల్లో కాలిపోయాయి. కుటుంబ సభ్యులు అప్రమత్తమై ఇంట్లో నుంచి పరిగెత్తుకుంటూ బయటకు వచ్చి తర్వాత నీళ్లు చల్లినప్పటికీ అప్పటికే వస్తువులన్నీ కాలిపోయాయి. విషయం తెలిసిన వెంటనే కర్నూలు అగ్నిమాపక అక్కడికి చేరుకుని నీళ్లు చల్లి ప్రమాద తీవ్రతను తగ్గించారు. ప్రమాదంలో రూ.2 లక్షల దాకా ఆస్తి నష్టం వాటిల్లి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు అంచనా వేశారు.

వృద్ధుడి మృతి

కర్నూలు : కల్లూరులోని చాముండేశ్వరి దేవాలయం వద్ద అద్దె ఇంట్లో నివాసముంటున్న షేక్ ఖలీల్ రెహమాన్ (62) గుండెనొప్పితో మృతిచెందాడు. ఓర్వకల్లు మండలం పూడిచెర్ల గ్రామానికి చెందిన ఈయన రెండేళ్ల క్రితం భార్యతో విడిపోయి కల్లూరుకు వలస వచ్చి చాముండేశ్వరి దేవాలయం వద్ద అద్దె గదిలో ఉంటున్నాడు. కూలీ పనులు చేసి జీవనం సాగించే ఈయనకు నలుగురు కూతుర్లు సంతానం. ఊర్లో ఉంటున్న కూతురు బషీరున్‌కు ఈ నెల 19వ తేదీన ఫోన్ చేసి తనకు గుండె నొప్పిగా ఉందని, హాస్పిటల్‌కు వెళ్తున్నట్లు చెప్పాడు. ఆ తర్వాత తలుపులు వేసుకుని ఇంట్లోనే సొమ్మసిల్లి పడిపోయాడు. ఐదు రోజులుగా ఇంట్లో నుంచి బయటకు రాకపోగా దుర్వాసన రావడంతో కాలనీ వాసులు కనుగొని మృతదేహాన్ని వెలికితీసి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. గుండెపోటుతోనే మృతిచెంది ఉండొచ్చునని కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు.

ఎన్నికల సమగ్ర సమాచారం సేకరించాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని కమ్యూనికేషన్ సెంటర్ సేకరించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీఎంయూ విభాగంలో ఏర్పాటు చేసిన కమ్యూనికేషన్ సెంటర్‌ను ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ..కమ్యూనికేషన్ సెంటర్‌లో టీవీలు ఏర్పాటు చేసి సోషల్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వచ్చే ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఇందుకు వీలుగా కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని డీఆర్వోను ఆదేశించా రు. డీఆర్వో కె.మధుసూదన్‌రావు, సీపీఓ హిమ ప్రభాకరరాజు, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, నోడల్ ఆఫీసర్ శ్రీనివాస్‌కుమార్ పాల్గొన్నారు.

విరసం రాష్ట్ర మహాసభల పోస్టర్ల ఆవిష్కరణ



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: విజయవాడ సిద్ధార్థ ఆడిటోరియంలో ఈనెల 27, 28 తేదీల్లో నిర్వహించనున్న విప్లవ రచయితల సంఘం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. బుధవారం సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విరసం రాష్ట్ర నాయకులు పాణి, నాగేశ్వరాచారి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్, కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, రాయలసీమ ప్రచురణలు సంపాదకులు ఇనాయతుల్లా, మారుతి, డీటీఎఫ్ నాయకులు రత్నం ఏసేపు, సుబ్బరాయుడు, కథా సమయం జి.వెంకట కృష్ణ, హరికిషన్, విశ్వనాథరెడ్డి, మహమ్మద్ మియ్యా, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.